TGTEL/26/A4985

# ఆదాబ్ సైబరాబాద్

ADAAB CYBERABAD

సంపుటి 01 - సంచిక : 01 ఎడిటర్ : శివ కుమార్ బివిస్ శనివారం 13-06-2026 పేజీలు : 4 వేల రూ : 5

### ట్రంప్ ఆగ్రహం



ఆదాబ్ సైబరాబాద్, న్యూ ఢిల్లీ : అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇరాన్పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. భారత్ కు చెందిన నౌకలపై ఇరాన్ డ్రోన్ దాడికి పాల్పడిందని ఆరోపిస్తూ, అది పూర్తిగా అంగీకరించలేని చర్య అని వ్యాఖ్యానించారు. అలాగే అమెరికా-ఇరాన్ శాంతి ఒప్పందానికి సంబంధించిన అంశాలపై ఇరాన్ తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. తన సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్'లో ట్రంప్ చేసిన వ్యాఖ్యల ప్రకారం, ఇరాన్ మీడియాకు లీక్ చేసిన ఒప్పంద నిబంధనలు లిఖితపూర్వకంగా అంగీకరించిన షరతులకు ఏమాత్రం సంబంధం లేదన్నారు. (మిగితా 2లో)

## రాష్ట్ర జనాభా 4.2 కోట్లకు పైగా..!

- హైదరాబాద్ క్యూఆర్ ప్రాంత జనాభా 1.42 కోట్లు
- జనగణన తొలి దశ ప్రాథమిక అంచనాలు వెల్లడి
- ఫిబ్రవరి 2027లో రెండో దశ సర్వే




ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర జనాభా 4.2 కోట్ల మార్కును దాటినట్లు జనగణన తొలి దశ ప్రాథమిక అంచనాలు వెల్లడిస్తున్నాయి. ఇదే సమయంలో ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోని హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ ప్రాంత జనాభా 1.42 కోట్లకు చేరినట్లు అధికారులు పేర్కొన్నారు. తుది లెక్కలు వెలువడే నాటికి ఈ ప్రాంత జనాభా 1.5 కోట్లను దాటే అవకాశముందని అంచనా వేస్తున్నారు. 2011 జనగణన ప్రకారం హైదరాబాద్ నగరం, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కలిపి జనాభా 92 లక్షలు ఉండగా, ప్రస్తుతం అది భారీగా పెరిగినట్లు ప్రాథమిక గణాంకాలు సూచిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా మే 11 నుంచి జూన్ 9 వరకు నిర్వహించిన గృహాల జాబితా, గృహ జనగణన తొలి దశలో ఈ వివరాలు వెలుగులోకి వచ్చాయి. (మిగితా 2లో)

## క్షిపణి రక్షణ వ్యవస్థలో భారత్‌కు మరో ఘన విజయం

- బ్యాలిస్టిక్ మిసైల్ డిఫెన్స్, యాంటీ-షిప్ క్షిపణి పరీక్షలు విజయవంతం
- ప్రపంచ అగ్రదేశాల సరసన భారత్
- 24 గంటల్లో మూడు కీలక క్షిపణి పరీక్షలు నిర్వహించిన డీఆర్‌డీఓ






ఆదాబ్ సైబరాబాద్, న్యూఢిల్లీ : దేశ రక్షణ సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దిశగా డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సంస్థ (డీఆర్‌డీఓ) మరో కీలక విజయాన్ని సాధించింది. జూన్ 10, 11 తేదీల్లో వరుసగా మూడు క్షిపణి ప్రయోగాలను విజయవంతంగా నిర్వహించి బ్యాలిస్టిక్ క్షిపణి రక్షణ వ్యవస్థ (బీఎండీ), యాంటీ-షిప్ క్షిపణి సాంకేతికతలను సమర్థంగా పరీక్షించింది. ఈ పరీక్షల ద్వారా దీర్ఘశ్రేణి బ్యాలిస్టిక్ క్షిపణుల నుంచి దేశాన్ని రక్షించే బహుస్థాయి రక్షణ వ్యవస్థ సామర్థ్యాన్ని, అలాగే సముద్రంలో శత్రు నౌకలను మధ్యస్థ దూరంలోనే లక్ష్యంగా చేసుకుని ధ్వంసం చేసే శక్తిని భారత్ నిరూపించింది. (మిగితా 2లో)

## 'మాదే అసలైన టీఎంసీ'..

- స్పీకర్ ను కలవనున్న తిరుగుబాటు ఎంపీలు
- తృణమూల్ కాంగ్రెస్లో ముదురుతున్న అంతర్గత సంక్షోభం
- 'రియల్ టీఎంసీ'గా గుర్తింపు కోరనున్న రెబల్ గ్రూప్
- 'రియల్ టీఎంసీ'గా గుర్తింపు కోరనున్న రెబల్ గ్రూప్
- ఎన్డీయేకు మద్దతుపై పట్టుదల




ఆదాబ్ సైబరాబాద్, న్యూఢిల్లీ: అల్ ఇండియా త్రిణమూల్ కాంగ్రెస్ లో అంతర్గత సంక్షోభం మరింత తీవ్రరూపం దాల్చుతోంది. పార్టీ అధిష్ఠానంపై అసంతృప్తితో ఉన్న తిరుగుబాటు ఎంపీలు తమదే అసలైన టీఎంసీ పార్లమెంటరీ గ్రూప్ అని ప్రకటించేందుకు సిద్ధవవుతున్నారు. ఈ మేరకు లోక్సభ స్పీకర్ ఓం బిర్లాను కలిసి అధికారిక గుర్తింపు కోరాలని నిర్ణయించారు.

ఈ విషయాన్ని రెబల్ ఎంపీ జగదీష్ చంద్ర వర్మ ధ్రువీకరించారు. ఇప్పటికే తమ గ్రూపు తరఫున స్పీకర్కు ఒక వినతిపత్రం సమర్పించామని, ఈ నెల 15న మరోసారి సమావేశమై తమను 'రియల్ టీఎంసీ' పార్లమెంటరీ గ్రూప్గా గుర్తించాలని కోరనున్నట్లు తెలిపారు.

### ప్రత్యేక గ్రూపు ఏర్పాటుకు ప్రయత్నాలు

టీఎంసీలోని తిరుగుబాటు ఎంపీలు ప్రత్యేక పార్లమెంటరీ గ్రూపును ఏర్పాటు చేయడంతో పాటు బీజేపీ నేతృత్వంలోని నేషనల్ డొమక్రాటిక్ అలయన్స్ కు మద్దతు ప్రకటించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. కూచ్ బెహార్ ఎంపీగా ఉన్న బసునియా ఈ వర్గానికి ప్రధాన మద్దతుదారుడిగా వ్యవహరిస్తున్నారు.

(మిగితా 2లో)

## నీట్ రీ-ఎగ్జామినేషన్ కు ఏర్పాట్లు

- ఎన్టీఏ డీజీతో సమీక్ష నిర్వహించిన క్యాబినెట్ కార్యదర్శి
- పరీక్ష నిర్వహణలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు
- జూన్ 21న నీట్ రీ-పరీక్ష

राष्ट्रीय परीक्षा एजेंसी
National Testing Agency
Excellence in Assessment

ఆదాబ్ సైబరాబాద్, న్యూఢిల్లీ : నీట్ రీ-ఎగ్జామినేషన్ను పారదర్శకంగా, సురక్షితంగా నిర్వహించేందుకు చేపడుతున్న ఏర్పాట్లను కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి టివి సోమనాథ్ శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ డైరెక్టర్ జనరల్తో సమావేశమై పరీక్ష నిర్వహణకు సంబంధించిన సన్నాహాలపై చర్చించారు. జూన్ 21, 2026న నిర్వహించనున్న నీట్ రీ-పరీక్షను ఎలాంటి లోపాలు లేకుండా విజయవంతంగా నిర్వహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తున్నాయని క్యాబినెట్ కార్యదర్శి తెలిపారు. పరీక్ష నిర్వహణలో పారదర్శకత, విశ్వసనీయత, భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన అధికారులను ఆదేశించారు.

(మిగితా 2లో)

## మీనాక్షి నటరాజన్ కు సుప్రీం కోర్టులో ఎదురుదెబ్బ

- నామినేషన్ రద్దుపై జోక్యానికి నిరాకరించిన ధర్మాసనం
- అభ్యంతరాలుంటే ఎన్నికల సంఘాన్నే ఆశ్రయించాలని సూచన





ఆదాబ్ సైబరాబాద్, న్యూఢిల్లీ : రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ కు సుప్రీంకోర్టులో ఊరట లభించలేదు. తెలంగాణలో నమోదైన ఓ క్రిమినల్ కేసు వివరాలను ఎన్నికల అఫిడవిట్లో వెల్లడించలేదనే కారణంతో ఆమె నామినేషన్ను తిరస్కరించిన ఎన్నికల అధికారుల నిర్ణయంలో జోక్యం చేసుకోవడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. సుప్రీం కోర్ట్ అఫ్ ఇండియా కు చెందిన జస్టిస్ పీకే మిశ్రా, జస్టిస్ ఏఎస్ చందుర్కర్ల ధర్మాసనం ఈ మేరకు దాఖలైన పిటిషన్ను కొట్టివేసింది. ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఒకసారి నామినేషన్ను తిరస్కరించిన తర్వాత, అభ్యర్థికి ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ప్రస్తుత దశలో నేరుగా జోక్యం చేసుకునే అవకాశం లేదని ధర్మాసనం పేర్కొంది. (మిగితా 2లో)

## తెలంగాణలో పోటీ చేసేందుకు పవన్ కల్యాణ్ కు పూర్తి స్వేచ్ఛ

- ప్రజాస్వామ్యంలో ఎవరికైనా ఎన్నికల్లో పోటీ చేసే హక్కు ఉంది: సీఎం రేవంత్ రెడ్డి
- కేంద్రం తెలంగాణపై వివక్ష చూపుతోందని ఆరోపణ
- మీనాక్షి నామినేషన్ తిరస్కరణ అప్రజాస్వామికమని వ్యాఖ్య





ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్ : తెలంగాణలో ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ కు పూర్తి స్వేచ్ఛ ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణకు రావడం, వెళ్లడం, ఎన్నికల్లో పోటీ చేయడం ప్రజాస్వామ్య హక్కులని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం న్యూఢిల్లీలో మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి, ప్రజలకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసిన సందర్భాల్లోనే పవన్ కల్యాణ్పై తమ పార్టీ మంత్రులు స్పందించారని తెలిపారు. తాను ఎప్పుడూ హిట్లర్ను ఆదర్శంగా భావిస్తున్నానని చెప్పలేదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఉన్న నాయకుడు ఎవరైనా హిట్లర్ను ఆదర్శంగా చెప్పుకుంటారా? అని ప్రశ్నించారు.

### మంత్రివర్గ విస్తరణపై చర్చ జరగలేదు

ఇటీవల పార్టీ అధిష్ఠానంతో జరిగిన సమావేశంలో మంత్రివర్గ విస్తరణ అంశంపై ఎలాంటి చర్చ జరగలేదని సీఎం వెల్లడించారు. ఈ విషయంలో వస్తున్న వార్తల్లో నిజం లేదన్నారు.

### మోదీ తనను కౌగిలించుకున్నారు

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తో జరిగిన సమావేశాన్ని ప్రస్తావిస్తూ, తనను మోదీయే కౌగిలించుకున్నారని, తాను ముందుగా అలా చేయలేదని రేవంత్ రెడ్డి తెలిపారు.

### కేంద్రంపై వివక్ష ఆరోపణలు

తెలంగాణ రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని సీఎం ఆరోపించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచనల మేరకే వ్యవహరిస్తున్నారని విమర్శించారు.


రాష్ట్రానికి సంబంధించిన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు నిధులు విడుదల కాకపోవడానికి కిషన్ రెడ్డే కారణమని ఆరోపించారు. రీజినల్ రింగ్ రోడ్ ప్రాజెక్టుకు కూడా ఆయన అడ్డంకిగా మారారని అన్నారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు విషయంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రితో ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. తెలంగాణ ప్రయోజనాల కోసం ప్రధానమంత్రితో ఒక్కసారైనా చర్చించారా అని కిషన్ రెడ్డిని నిలదీశారు.

### బీజేపీపై విమర్శలు

బీజేపీపై విమర్శలు గుప్పించిన సీఎం రేవంత్ రెడ్డి, గాడ్సేనే కాకుండా ఉత్తర కొరియా నాయకుడు కిమ్ను కూడా ఆ పార్టీ ఆదర్శంగా తీసుకుందని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. బీజేపీకి తెలిసింది ఓట్ల దోపిడీ, సీట్ల దోపిడీ మాత్రమేనని ఎద్దేవా చేశారు.

మధ్యప్రదేశ్లో సంఖ్యాబలం లేకపోయినా మూడో అభ్యర్థిని బరిలోకి దింపడం ద్వారా బీజేపీ ఉద్దేశం బయటపడిందన్నారు. కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణను అప్రజాస్వామిక చర్యగా అభివర్ణించారు. ఆమెపై ఎలాంటి కేసు లేదని, అయినప్పటికీ నామినేషన్ను తిరస్కరించడం బాధాకరమని అన్నారు. మహిళల పట్ల వ్యతిరేక ధోరణితోనే బీజేపీ వ్యవహరిస్తోందని సీఎం విమర్శించారు.

## భారత నౌకలపై డ్రోన్ దాడి ఆరోపణలు 'ఫేక్ న్యూస్' ప్రచారంపై మండిపాటు




(మొదటి పేజీ తరువాయి)
ఒప్పందంపై ఇరాన్ విడుదల చేసిన ప్రకటనలు వాస్తవాలకు విరుద్ధంగా ఉన్నాయని, మంచి విశ్వాసంతో వ్యవహరించే దేశంగా ఇరాన్ కనిపించడం లేదని విమర్శించారు. అదేవిధంగా, హోర్ముజ్ జలసంధి నుంచి బయలుదేరుతున్న భారత నౌకలపై డ్రోన్ దాడి జరిగినట్లు ఆరోపించిన ట్రంప్, ఇటువంటి చర్యలు వెంటనే ఆగాలని హెచ్చరించారు. ఈ ఘటనను "పూర్తిగా అంగీకరించలేనిది"గా అభివర్ణించారు. "ఇరాన్ ఫేక్ న్యూస్ మాధ్యమాలకు వెల్లడించిన ఒప్పంద నిబంధనలకు, లిఖితపూర్వకంగా అంగీకరించిన నిబంధనలకు ఎలాంటి సంబంధం లేదు. వారు చెప్పిన మాటలు నిజానికి దూరంగా ఉన్నాయి. వారితో మంచి విశ్వాసంతో ఒప్పందాలు చేసుకోవడం అసాధ్యం. భారత నౌకలపై జరిగిన డ్రోన్ దాడి పూర్తిగా అంగీకరించలేనిది. ఇరాన్ వెంటనే తన వైఖరిని మార్చుకోవాలి" అని ట్రంప్ తన పోస్టులో పేర్కొన్నారు. అమెరికా-ఇరాన్ మధ్య శాంతి ఒప్పందంపై ఉద్రిక్తతలు కొనసాగుతున్న సమయంలో ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

(మొదటి పేజీ తరువాయి)

### 1.2 కోట్ల గృహాల సర్వే అధికారుల

సమాచారం ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.2 కోట్ల గృహాలను సర్వే చేశారు. 2011 జనగణనలో నమోదైన 83 లక్షల గృహాలతో పోలిస్తే ఇది గణనీయమైన పెరుగుదల. జూన్ 9 వరకు అందుబాటులో ఉన్న ఆన్లైన్ సమాచారాన్ని బట్టి గత 16 ఏళ్లలో రాష్ట్ర జనాభా దాదాపు 70 లక్షలు పెరిగినట్లు తెలుస్తోంది. వార్షిక జనాభా వృద్ధిరేటు సగటున 1.25 శాతం నమోదైనట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

### క్యూర్ ప్రాంతంలో 35.91 లక్షల నివాస గృహాలు

ఓఆర్ఆర్ పరిధిలోని హైదరాబాద్ క్యూర్ ప్రాంతంలో పాత జీహెచ్ఎంసీ పరిధి, సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ప్రాంతాలు ఉన్నాయి. ఈ ప్రాంత జనాభా 1.42 కోట్లుగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. తొలి దశ సర్వేలో మొత్తం 35.91 లక్షల నివాస గృహాలను గుర్తించారు.
అయితే సర్వే సమయంలో గణనీయ సంఖ్యలో ఇళ్లు తాళాలు వేసి ఉండటంతో వివరాలు సేకరించలేకపోయినట్లు అధికారులు తెలిపారు. రెండో, మూడోసారి సందర్శించినప్పటికీ కొన్ని కుటుంబాల సమాచారం నమోదు కాలేదన్నారు. క్యూర్ ప్రాంతంలో సుమారు 5 శాతం ఇళ్లు సర్వేకు అందుబాటులోకి రాకపోవడం వల్ల ప్రాథమిక జనాభా అంచనాలపై కొంత ప్రభావం ఉండొచ్చని పేర్కొన్నారు.

### 2027లో రెండో దశ జనగణన

జనగణన రెండో దశను 2027 ఫిబ్రవరిలో నిర్వహించనున్నారు. ఈ దశలో వ్యక్తిగత వివరాలతో పాటు కులగణన సమాచారాన్ని కూడా సేకరించనున్నారు. తొలి, రెండో దశల సమాచారాన్ని సమగ్రంగా పరిశీలించిన అనంతరం కేంద్ర ప్రభుత్వం తుది జనగణన గణాంకాలను విడుదల చేయనుంది.

### 80 వేల మంది సిబ్బంది భాగస్వామ్యం

తొలి దశ జనగణనలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 80 వేల మంది ఉద్యోగులు పాల్గొన్నారు. ప్రతి భవనం, ఇల్లు, మౌలిక సదుపాయాలు, కుటుంబ యజమాని పేరు, కుటుంబ సభ్యుల సంఖ్య తదితర వివరాలను సేకరించి ఆన్లైన్లో నమోదు చేశారు. తొలి దశలో వివరాలు నమోదు కాకపోయిన కుటుంబాలు సమీప మున్సిపల్ కార్యాలయం లేదా గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సంప్రదించాలని అధికారులు సూచించారు. అధికారిక జనాభా గణాంకాలు 2027 చివర్లో లేదా 2028 ప్రారంభంలో విడుదలయ్యే అవకాశం ఉందని ఉన్నతాధికారులు తెలిపారు.

(మొదటి పేజీ తరువాయి)..

## సింఘ్వీ వాదనలు

మీనాక్షి తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపిస్తూ, కనీసం రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువ శిక్ష విధించే అవకాశం ఉన్న కేసుల వివరాలను మాత్రమే అభ్యర్థులు అఫిడవిట్లో తప్పనిసరిగా వెల్లడించాల్సి ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం ప్రస్తావనలో ఉన్న కేసులో కేవలం సమన్లు మాత్రమే జారీ అయ్యాయని, శిక్ష విధింపు దశకు చేరుకోలేదని ధర్మాసనానికి వివరించారు.
అయితే రిటర్నింగ్ అధికారి తప్పుగా నిర్ణయం తీసుకుని నామినేషన్ను తిరస్కరించారని ఆయన వాదించారు. దీనిపై స్పందించిన ధర్మాసనం, నామినేషన్ తిరస్కరణ వ్యవహారంలో తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. ఇలాంటి అంశాలపై గతంలో ఇచ్చిన తీర్పులు ఉంటే కోర్టు దృష్టికి తీసుకురావాలని సూచించింది.

### అఫిడవిట్లో కేసు వివరాలు లేవని అభ్యంతరం

అందుబాటులో ఉన్న పత్రాలను పరిశీలించిన అనంతరం, మీనాక్షి సమర్పించిన ఫారం-26 అఫిడవిట్లో తెలంగాణలో నమోదైన కేసు వివరాలు ప్రస్తావించలేదని రిటర్నింగ్ అధికారి అర్వింద్ శర్మ పేర్కొన్నట్లు సమాచారం. ఈ అంశంపై బీజేపీ అభ్యర్థి మహేష్ శేవత్ ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

### కాంగ్రెస్ ఆగ్రహం

ఇదిలా ఉండగా, మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణపై జీతూ పట్వారి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయాన్ని ఖండిస్తూ కాంగ్రెస్ పార్టీ తరపున న్యాయపరమైన, రాజకీయపరమైన పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు. రాజ్యసభ ఎన్నికల వేళ ఈ పరిణామం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## నీట్ రీ-ఎగ్జామినేషన్ కు ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి)..

### అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు

పరీక్ష సమగ్రతను దెబ్బతీయడానికి, నిర్వహణను భంగం కలిగించడానికి లేదా ఎలాంటి అక్రమాలకు పాల్పడే వారిపై చట్టం తన పూర్తి శక్తితో చర్యలు తీసుకుంటుందని డాక్టర్ సోమనాథన్ హెచ్చరించారు. నీట్ రీ-పరీక్షను ప్రభావితం చేసే ప్రయత్నాలను ప్రభుత్వం ఏమాత్రం సహించబోదని స్పష్టం చేశారు.

### ఇప్పటికే పలు దఫాల సమీక్షలు

నీట్ రీ-పరీక్ష ఏర్పాట్లపై కేంద్ర ప్రభుత్వ కార్యదర్శులు, సంబంధిత సంస్థల అధికారులతో ఈ నెల 1న సమీక్ష సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం జూన్ 4న రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శులతో సమావేశమై రాష్ట్రాల వారీగా చేపడుతున్న ఏర్పాట్ల పురోగతిని పరిశీలించినట్లు వెల్లడించారు.

### విశ్వసనీయత కాపాడటమే లక్ష్యం

నీట్ రీ-పరీక్ష నిర్వహణలో అన్ని శాఖల మధ్య సమన్వయం పెంపొందించడం, భద్రతా చర్యలను మరింత పటిష్టం చేయడం, పరీక్ష ప్రక్రియ విశ్వసనీయతను కాపాడడం లక్ష్యంగా ఈ సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు హాజరుకానున్న ఈ పరీక్షను ఎలాంటి వివాదాలకు తావులేకుండా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు వెల్లడించారు.

(మొదటి పేజీ తరువాయి)

### కీర్తి ఆజాద్ ఆరోపణలపై ప్రతిస్పందన

టీఎంసీ ఎంపీలను పార్టీ ఫిరాయింపులకు కొందరు ప్రోత్సహిస్తున్నారని టీఎంసీ ఎంపీ కృతి ఆజాద్ చేసిన ఆరోపణలను బసునియా ఖండించారు. ఆ వ్యాఖ్యలు అవాస్తవమని, తాము 19 మంది ఎంపీల బృందంగా వ్యవహరిస్తున్నామని చెప్పారు. ఆధారాలు లేకుండా ఇలాంటి ఆరోపణలు చేయడం సరికాదని పేర్కొన్నారు.

### కకోలీ ఘోష్ నేతృత్వంలో తిరుగుబాటు వర్గం

తిరుగుబాటు ఎంపీలకు కాకోలీ ఘోష్ దస్తీదార్ నాయకత్వం వహిస్తున్నట్లు సమాచారం. లోక్సభలోని 20 మంది టీఎంసీ ఎంపీలు ఎన్డీయేకు మద్దతు ఇస్తున్నట్లు ఆమె ఇటీవల ప్రకటించారు. ఈ వర్గంలో శతాబ్ది రాయ్, యూసఫ్ పఠాన్, సాయిని గోష్, శత్రుఘన్ సిన్హా తదితర ప్రముఖ ఎంపీలు ఉన్నట్లు తెలుస్తోంది.

### జాతీయ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం

టీఎంసీ లోక్సభ సభ్యుల్లో గణనీయ సంఖ్యలో ఎంపీలు తిరుగుబాటు బాట పట్టడం, ఎన్డీయేకు మద్దతు ప్రకటించేందుకు సిద్ధమవుతున్నట్లు వార్తలు రావడం జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. స్పీకర్ నిర్ణయం, తదుపరి రాజకీయ పరిణామాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

(మొదటి పేజీ తరువాయి)

### శత్రు క్షిపణులను గగనతలంలోనే ధ్వంసం

డీఆర్డీఓ వివరాల ప్రకారం, పరీక్షించిన ఇంటర్సెప్టర్ క్షిపణులు తమ లక్ష్యాలను కచ్చితంగా ఛేదించి విజయవంతంగా ధ్వంసం చేశాయి. 2,000 నుంచి 5,000 కిలోమీటర్ల పరిధి గల ఇంటర్మీడియట్ రేంజ్ బ్యాలిస్టిక్ మిస్సైళ్లను అడ్డుకునే సామర్థ్యం ఈ వ్యవస్థకు ఉందని అధికారులు వెల్లడించారు. పరీక్షల్లో భూమి వాతావరణానికి వెలుపల ఎక్సో-అట్మాస్ఫెరిక్, వాతావరణం లోపల ఎండో-అట్మాస్ఫెరిక్ పనిచేసే రెండు రకాల ఇంటర్సెప్టర్ క్షిపణులను వినియోగించినట్లు సమాచారం. అన్ని సాంకేతిక పరీక్షలు పూర్తయిన అనంతరం వీటిని సైనిక వినియోగ పరీక్షలకు పంపనున్నారు.

### పాకిస్థాన్ క్షిపణుల నేపథ్యంలో ప్రాధాన్యత

పాకిస్థాన్ దీర్ఘశ్రేణి బ్యాలిస్టిక్ క్షిపణులైన 'ఫతేహ్-1', 'ఫతేహ్-2'తో పాటు చైనా సాంకేతిక ఆధారంగా రూపొందించిన పీ-282 క్షిపణుల అభివృద్ధిపై దృష్టి సారిస్తున్న నేపథ్యంలో భారత్ కూడా క్షిపణి రక్షణ వ్యవస్థకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు రక్షణ వర్గాలు పేర్కొన్నాయి.

### ఎలైట్ దేశాల జాబితాలో భారత్

ఈ విజయంతో బ్యాలిస్టిక్ క్షిపణి దాడులను సమర్థంగా తిప్పికొట్టగల సామర్థ్యం ఉన్న ప్రపంచంలోని కొద్దిమంది దేశాల సరసన భారత్ నిలిచింది. దీర్ఘశ్రేణి, ఖండాంతర బ్యాలిస్టిక్ క్షిపణుల (ఐసీబీఎం) ముప్పును ఎదుర్కొనే సాంకేతికతను కలిగి ఉన్న దేశంగా భారత్ గుర్తింపు పొందింది.

### యాంటీ-షిప్ క్షిపణి తొలి పరీక్ష సక్సెస్

మరో కీలక ఘట్టంగా, డీఆర్డీఓ అభివృద్ధి చేసిన నావల్ యాంటీ-షిప్ మిసైల్ -మీడియం రేంజ్ తొలి ప్రయోగాన్ని కూడా విజయవంతంగా నిర్వహించింది. మధ్యస్థ దూరంలో శత్రు యుద్ధ నౌకలను కచ్చితంగా ఛేదించే సామర్థ్యాన్ని ఈ పరీక్ష నిరూపించింది. దీంతో భారత నౌకాదళానికి సముద్ర యుద్ధాల్లో మరింత బలమైన దాడి సామర్థ్యం లభించనుంది.

### రాజ్నాథ్ సింగ్ అభినందనలు

ఈ ప్రయోగాలను డీఆర్డీఓ ఛైర్మన్ రాజేష్ కుమార్ సింగ్, సాయుధ దళాల ఉన్నతాధికారులు ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. కేవలం 24 గంటల వ్యవధిలో అనేక క్లిష్టమైన పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసిన డీఆర్డీఓ శాస్త్రవేత్తలు, పరిశ్రమ భాగస్వాములు, సాయుధ దళాల సిబ్బందిని ఆయన అభినందించారు. రక్షణ మంత్రి రాజనాథ్ సింగ్ కూడా డీఆర్డీఓకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ విజయం భారత రక్షణ సన్నద్ధతను మరింత బలోపేతం చేయడంతో పాటు గగనతల, సముద్ర మార్గాల నుంచి వచ్చే విభిన్న ముప్పులను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంచుతుందని ఆయన పేర్కొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి

### నిత్యం పర్యవేక్షణతో పనులు త్వరగా పూర్తి చేయాలి: కలెక్టర్ గరిమ అగ్రవాల్



ఆదాబ్ సైబరాబాద్, సిరిసిల్ల : జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి, ప్రతి దశను అధికారులు నిత్యం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్లో హౌసింగ్ శాఖ అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఏఈలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని మండలాల వారీగా పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 7,367 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. వాటిలో 5,798 ఇళ్లకు ముగ్గు పోయగా, 5,014 ఇళ్లు బేస్మెంట్ దశలో ఉన్నాయని చెప్పారు. అలాగే 4,362 ఇళ్లు గోడల స్థాయికి చేరగా, 4,012 ఇళ్లు స్లాబ్ దశలో ఉన్నాయని, 2,834 ఇళ్ల నిర్మాణం పూర్తయిందని వెల్లడించారు.

ముగ్గు పోసిన లబ్ధిదారులు వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించేలా చూడాలని, బేస్మెంట్ పూర్తిచేసిన ఇళ్లను గోడల దశకు, అక్కడి నుంచి స్లాబ్ స్థాయికి తీసుకెళ్లి తుది దశ పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు.

ప్రతి మండలంలో ఎంపీడీవోలు ఇందిరమ్మ ఇళ్ల పురోగతిని నిరంతరం సమీక్షించాలని, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో తరచూ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. మండలాలకు కేటాయించిన లక్ష్యాలకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించి నిర్మాణాలను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. లబ్ధిదారులకు ఇటుకలు, సిమెంట్, ఇతర నిర్మాణ సామగ్రి అందుబాటులో ఉండేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. మేస్త్రీలు, వడ్రంగులు తదితర కార్మికుల వివరాలను లబ్ధిదారులకు అందుబాటులో ఉంచి ఇబ్బందులు తొలగించాలని సూచించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను వినియోగించుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని, దానిని సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని ఎంపీడీవోలకు సూచించారు. నిర్మాణంలో ఉన్న ఇళ్ల ఫొటోలను హౌసింగ్ ఏఈలు ఎప్పటికప్పుడు ఆన్లైన్లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వ నిధులు క్రమంగా జమ అవుతున్నాయని, ఇళ్ల నిర్మాణాలకు జిల్లాలో ఎక్కడా ఇసుక కొరత లేదని కలెక్టర్ స్పష్టం చేశారు.
సమావేశంలో హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకట మాధవరావు, డీఆర్డీవో లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

# వర్షాలకు ముందే అప్రమత్తం కావాలి

- వరద ముప్పు ప్రాంతాలపై నిరంతర నిఘా అవసరం
- సమస్యలు తలెత్తకముందే పరిష్కార చర్యలు చేపట్టాలి
- డీఆర్ఎఫ్ బృందాలకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాలు




ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్ : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నగరంలోని పలు ప్రాంతాలు నీటమునిగిన నేపథ్యంలో అలాంటి పరిస్థితులు మళ్లీ పునరావృతం కాకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. ఊహించని విధంగా కురుస్తున్న వర్షాలకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం వర్షాకాల సన్నద్ధతపై డీఆర్ఎఫ్ బృందాలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వర్షం కురిసినప్పుడు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు తలెత్తుతున్నాయో పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆదేశించారు. మూడు కమిషనరేట్ల పరిధిలో మొత్తం 913 వరద ముంపు ప్రాంతాలను గుర్తించామని, అందులో 257 ప్రాంతాలు అత్యంత సమస్యాత్మకమైనవిగా గుర్తించినట్లు తెలిపారు. ఈ ప్రాంతాల వద్ద డీఆర్ఎఫ్ బృందాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రస్తుతం 51 డీఆర్ఎఫ్ బృందాలు పనిచేస్తుండగా, త్వరలోనే అదనపు మెట్, స్టాటిక్ బృందాలను కూడా రంగంలోకి దింపనున్నట్లు చెప్పారు. అన్ని బృందాలు పరస్పర సమన్వయంతో పాటు ఇతర శాఖలతో కలిసి పనిచేయాలని ఆదేశించారు. 24 గంటలూ వాతావరణ హెచ్చరికలను పరిశీలిస్తూ ముందస్తు సన్నద్ధతతో ఉండాలని సూచించారు.

## ప్రజల భాగస్వామ్యంతో సమస్యల పరిష్కారం

వర్షాకాల సమస్యల పరిష్కారంలో ప్రజలను భాగస్వాములను చేయాలని కమిషనర్ సూచించారు. ప్రధాన వాటర్ లాగింగ్ ప్రాంతాల్లో స్థానికులతో కమిటీలు ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారంలో వారిని భాగస్వామ్యం చేయాలని తెలిపారు. అలాగే మ్యాన్హోల్స్ ఉన్న ప్రాంతాలను సులభంగా గుర్తించేలా సమీప గోడలపై ప్రత్యేక గుర్తులు వేయాలని ఆదేశించారు. ఈ నెల 9వ తేదీన కురిసిన భారీ వర్షాల కారణంగా నీటమునిగిన ప్రాంతాల పరిస్థితిని సమావేశంలో సమీక్షించారు. వరదలకు దారితీసిన కారణాలను విశ్లేషించి, వాటి నివారణకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## ట్రాఫిక్కు అంతరాయం లేకుండా చర్యలు

ప్రధాన రహదారులపై నీటిముంపు సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక దృష్టి సారించాలని హైడ్రా కమిషనర్ సూచించారు. నగరంలో ఒక్కరోజు ట్రాఫిక్ స్తంభిస్తే సుమారు రూ.400 కోట్ల వరకు ఆర్థిక నష్టం సంభవించే అవకాశం ఉందని నిపుణుల అంచనాలను గుర్తు చేశారు. అందువల్ల ట్రాఫిక్కు ఎటువంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. అన్ని శాఖల మధ్య సమన్వయం ఉండేలా చూసుకోవడంతో పాటు కమ్యూనికేషన్ లోపాలు లేకుండా జాగ్రత్త పడాలని సూచించారు. చెట్లు కూలిన సమయంలో సహాయక చర్యలకు డీఆర్ఎఫ్ వాహనాలు చేరుకోలేని పరిస్థితుల్లో బైకుల ద్వారా సిబ్బంది ఘటనాస్థలికి చేరుకునేలా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. సమావేశంలో హైడ్రా అదనపు సంచాలకులు వర్ల పాపయ్య, అదనపు కమిషనర్ ఆర్. సుదర్శన్, ఏసీపీలు పి. తిరుమల్, ఉమా మహేశ్వరరావు, శ్రీకాంత్, ఆర్ఎఫ్వో జయప్రకాశ్తో పాటు డీఎఫ్వోలు, ఎస్ఎఫ్వోలు, ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

# కేబీఆర్ పార్కు పరిసరాల్లో 672 చెట్లకు జియో ట్యాగింగ్

- పౌరుల చొరవతో డేటాబేస్ రూపొందింపు
- చెట్ల సంరక్షణకు పారదర్శకత, జవాబుదారీతనం పెంపే లక్ష్యం



ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్ : కేబీఆర్ జాతీయ పార్కు పరిసరాల్లో ఉన్న చెట్ల సంరక్షణ కోసం పౌరుల బృందం చేపట్టిన ప్రత్యేక సర్వేలో 672 చెట్లకు జియో ట్యాగింగ్ పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో ఉండే డేటాబేస్ను రూపొందించింది. సుప్రీంకోర్టు కాసు బ్రహ్మానందరెడ్డి పార్కు పర్యావరణ సున్నిత ప్రాంతంలో చెట్ల నరికివేతపై స్టే విధించిన నేపథ్యంలో ఈ కార్యక్రమం చేపట్టడం విశేషం.

ఈ ఏడాది మే 18న చెట్ల నరికివేత కొనసాగుతోందంటూ దాఖలైన పిటిషన్పై స్పందించిన సుప్రీమ్ కోర్ట్ అఫ్ ఇండియా, కేబీఆర్ పార్కు చుట్టూ ఉన్న ఎకో-సెన్సిటివ్ జోన్లో చెట్ల తొలగింపుపై తాత్కాలిక నిషేధం విధించింది. అనంతరం 'సేవ్ కేబీఆర్' ఉద్యమానికి చెందిన పౌర స్వచ్ఛంద కార్యకర్తలు చెట్ల లెక్కింపు, గుర్తింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు.

మూడు రోజుల పాటు 15 మంది వాలంటీర్లు కేబీఆర్ పార్కు చుట్టూ ఉన్న రోడ్ల మధ్య విభాగాల్లో (మీడియన్లలో) నిలిచి ఉన్న ప్రతి చెట్టును గుర్తించి వివరాలను నమోదు చేశారు. ప్రతి చెట్టుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయించడంతో పాటు జీపీఎస్ ఆధారంగా జియో ట్యాగింగ్ చేశారు. చెట్ల జాతులు, వాటి స్థానాలను గుర్తించి సమగ్ర మ్యాప్ రూపొందించారు. ఈ మ్యాప్ను ప్రజలకు అందుబాటులో ఉంచారు.

ఈ కార్యక్రమానికి అభివృద్ధి సలహాదారు నతాషా రామరత్నం నాయకత్వం వహించగా, 'సేవ్ కేబీఆర్' ఉద్యమ కార్యకర్తలు సహకరించారు. గురువారం జరిగిన కార్యక్రమంలో జియో ట్యాగ్ మ్యాప్ను ఆవిష్కరించారు.

## చెట్ల సంరక్షణకు శాస్త్రీయ ఆధారం

ఇప్పటికే నరికివేసిన చెట్లను తిరిగి తీసుకురాలేకపోయినా, ప్రస్తుతం మిగిలి ఉన్న చెట్లను శాస్త్రీయంగా నమోదు చేయడం అత్యంత అవసరమని నటాషా రామరత్నం పేర్కొన్నారు. చెట్లను జియో ట్యాగ్ చేసి లెక్కించడం ద్వారా వాటి పర్యవేక్షణ, సంరక్షణ మరింత సమర్థవంతంగా సాగుతుందని తెలిపారు.

## వివిధ రకాల వృక్ష జాతుల గుర్తింపు

చెట్ల జాతులను గుర్తించే ప్రక్రియలో పాల్గొన్న ప్రకృతి ప్రేమికురాలు ూంఅఖు ఖష్ఘుఅ మాట్లాడుతూ, మీడియన్లలో ఇటీవలే నాటిన ఒకే రకమైన చెట్లు ఉన్నాయనే వాదనలను ఈ సర్వే ఖండించిందన్నారు. సర్వేలో అనేక స్థానిక జాతులతో పాటు దశాబ్దాల నాటి పెద్ద చెట్లు కూడా ఉన్నట్లు వెల్లడైందని చెప్పారు.

## పారదర్శకతకు దోహదం

ప్రజలకు అందుబాటులో ఉంచిన ఈ జియో ట్యాగ్ మ్యాప్ ద్వారా పౌరులు, పరిశోధకులు, అధికారులు కేబీఆర్ పార్కు పరిసరాల్లో చెట్ల సంఖ్యలో వచ్చే మార్పులను సులభంగా గుర్తించే అవకాశం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. నగరంలోని ప్రధాన హరిత ప్రాంతాల్లో ఒకటైన కేబీఆర్ పార్కు చుట్టూ చెట్ల సంరక్షణకు ఈ డేటాబేస్ ఉపయోగపడుతుందని, భవిష్యత్ మౌలిక వసతుల ప్రాజెక్టుల ప్రభావాన్ని అంచనా వేయడంలో కూడా ఇది కీలకంగా మారనుందని పేర్కొన్నారు.

# పాఠశాల విద్య సమస్యల పరిష్కారానికి ఏబీవీపీ ఆందోళన

- మేడ్చల్ డీఈవో కార్యాలయం ముట్టడి
- ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల సమస్యలపై తీవ్ర ఆందోళన






ఆదాబ్ సైబరాబాద్, మేడ్చల్: రాష్ట్రంలో పాఠశాల విద్యారంగంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా డీఈవో కార్యాలయాన్ని శుక్రవారం ముట్టడించారు. ఈ సందర్భంగా కొంత ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. కార్యక్రమంలో పాల్గొన్న ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్యామ్ కిరణ్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దాదాపు 12 సంవత్సరాలు పూర్తవుతున్నప్పటికీ పాఠశాల విద్యారంగం ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందలేదని విమర్శించారు. రేషనలైజేషన్ పేరుతో వేలాది ప్రభుత్వ పాఠశాలలను మూసివేశారని, ప్రస్తుతం అనేక ప్రభుత్వ పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా కొనసాగుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత కారణంగా పేద విద్యార్థులు కూడా ప్రభుత్వ బడుల వైపు చూడని పరిస్థితి ఏర్పడిందన్నారు. అనేక పాఠశాలల్లో మరుగుదొడ్లు లేక బాలికలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కొత్త విద్యాసంవత్సరం ప్రారంభమైనప్పటికీ ఇప్పటివరకు విద్యార్థులకు యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు పూర్తిస్థాయిలో అందలేదని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పర్యవేక్షణ లోపం కారణంగా విద్యార్థులు పలు సామాజిక సమస్యలకు గురవుతున్నారని, మరోవైపు ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల భారం తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. హైదరాబాద్లోని కొన్ని ప్రైవేట్, అంతర్జాతీయ పాఠశాలలు నర్సరీ స్థాయి నుంచే లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు.

అలాగే పూర్తి స్థాయిలో డీఈవోలు, ఎంఈవోలు లేకపోవడం వల్ల విద్యా పరిపాలన దెబ్బతింటోందన్నారు. కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు, గురుకుల పాఠశాలలు అనుమతులు లేని అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని, కొన్ని చోట్ల భవనాల శిథిలావస్థ కారణంగా విద్యార్థులు ప్రమాదాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. పాఠశాల విద్యలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపడతామని ఏబీవీపీ హెచ్చరించింది.

## ఏబీవీపీ ప్రధాన డిమాండ్లు

- ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి.
- ఫీజు నియంత్రణ చట్టం తీసుకువచ్చి ప్రైవేట్ పాఠశాలల ఫీజులను నియంత్రించాలి.
- నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలి.
- డీఈవో, ఎంఈవో పోస్టులను పూర్తి స్థాయిలో భర్తీ చేయాలి.
- ప్రభుత్వ పాఠశాలల్లో బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలు చేపట్టాలి.
- గురుకుల పాఠశాలలకు శాశ్వత భవనాల నిర్మాణం చేపట్టాలి.
- ఈ కార్యక్రమంలో ఏబీవీపీ కూకట్పల్లి విభాగ్ కన్వీనర్ నగేష్, ఎస్టబ్ల్యూసీ సభ్యులు అఖిల్, జిల్లా కన్వీనర్లు మృతుంజయ్, బాలు, భరత్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణపై కాంగ్రెస్ శిక్షణ శిబిరం




ఆదాబ్ సైబరాబాద్, కుత్బుల్లాపూర్ : టీపీసీసీ ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శిక్షణ, అవగాహన శిబిరం నిర్వహించారు. కొంపల్లిలోని ఎస్ఎన్ఆర్ గార్డెన్స్లో జరిగిన ఈ కార్యక్రమానికి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ శిబిరంలో టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి పాల్గొని బూత్ స్థాయి ఏజెంట్లకు (బీఎల్ఏలు) ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ, పార్టీ కార్యకర్తల బాధ్యతలపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా ఎస్ఐఆర్ అబ్జర్వర్, తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎం.ఏ. ఫహీం, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్ రెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎస్ఎస్ఏ కో-ఆర్డినేటర్ ఏపీ మిథున్ రెడ్డి హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి బూత్ స్థాయిలో అప్రమత్తంగా పనిచేసి అర్హులైన ప్రతి ఓటరిని జాబితాలో చేర్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, టీపీసీసీ ప్రోటోకాల్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆర్. లక్ష్మి, నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ నాయకులు, డివిజన్ స్థాయి నాయకులు, బీఎల్ఏలు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

## ఆక్రమణల తొలగింపుతో ట్రాఫిక్కు ఊరట



ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్ : : ట్రాఫిక్కు ఆటంకంగా మారిన ఆక్రమణలను తొలగించేందుకు సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. అడ్డగుట్ట రోడ్డు, లులు మాల్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో నిర్వహించిన ప్రత్యేక ఎన్ఫోర్స్మెంట్ డ్రైవ్లో రహదారులను ఆక్రమించి ఏర్పాటు చేసిన తోపుడు బండ్లను తొలగించారు. ఈ చర్యలతో ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ తగ్గి, వాహనాల రాకపోకలు సాఫీగా సాగేందుకు అవకాశం ఏర్పడింది. అలాగే పాదచారుల రాకపోకలు కూడా సురక్షితంగా, సౌకర్యవంతంగా మారాయి. ప్రజల సౌకర్యం, రహదారి భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ ఈ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ప్రజా రహదారులు, ఫుట్పాత్లను ఆక్రమించకుండా వ్యాపారులు సహకరించాలని కోరారు.

## అనారోగ్య బాధితులను పరామర్శించిన శంభీపూర్ కృష్ణ

- అన్ని విధాలా అండగా ఉంటామని హామీ
- తాండాల్లో కాలుష్యం, మంచినీటి సమస్యలపై ప్రజల ఆవేదన



ఆదాబ్ సైబరాబాద్, దుండిగల్ :: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని దుండిగల్ సర్కిల్ పరిధిలో అనారోగ్యంతో బాధపడుతున్న బీఆర్ఎస్ కార్యకర్తలు, స్థానికులను బీఆర్ఎస్ నాయకుడు శంభీపూర్ కృష్ణ పరామర్శించారు. మాజీ కౌన్సిలర్ కొర్ర శంకర్ నాయక్తో కలిసి బాధితుల నివాసాలకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గాగిల్లాపూర్ తాండకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త జగన్ నాయక్ ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా, దుండిగల్ తాండకు చెందిన కాట్రోత్ లక్ష్మణ్ నాయక్ కిడ్నీ, ఊపిరితిత్తుల వ్యాధులతో చికిత్స పొందుతున్నారు. వీరిని పరామర్శించిన శంభీపూర్ కృష్ణ, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న లక్ష్మీబాయి, ఫకీరా రాజు నివాసాలకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు తమ సమస్యలను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. తాండాల్లో వాయు కాలుష్యం, కలుషితమైన తాగునీటి కారణంగా ప్రజలు అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యం కల్పించి ప్రజలను ఆదుకోవాలని నాయకులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు అమర్ సింగ్ నాయక్, వెంకటేష్ నాయక్, ప్రవీణ్ నాయక్, హనుమంతు, నర్సింగ్ నాయక్, కుమార్ నాయక్, రాజు నాయక్, వాసు నాయక్, పటేల్ రెడ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు

## మాజీ ఐఏఎస్ అధికారి చిరంజీవులకు 'రాజ్యాధికార సమరభేరి' ఆహ్వానం

- జూలై 5న భువనగిరిలో భారీ బహిరంగ సభ
- ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని టీఆర్పీ పిలుపు




ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్ : తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) ఆధ్వర్యంలో జూలై 5న భువనగిరిలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభ 'రాజ్యాధికార సమ-రభేరి'కి మాజీ ఐఏఎస్ అధికారి చిరంజీవులను పార్టీ నాయకులు ఆహ్వానించారు. సభకు సంబంధించిన ఆహ్వాన పత్రికను ఆయనకు అందజేశారు.

ఈ సందర్భంగా టీఆర్పీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పటేల్ వనజక్క చిరంజీవులను మర్యాదపూర్వకంగా కలిసి సభలో పాల్గొనాల్సిందిగా కోరారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు రాజకీయ అధికారం దక్కాలనే లక్ష్యంతో ఈ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, చిరంజీవులు ప్రభుత్వ పరిపాలనలో విశేష అనుభవం కలిగిన అధికారి అని కొనియాడారు.
ప్రజాసేవకు అంకితభావంతో పనిచేసి సమాజంలో ప్రత్యేక గుర్తింపు పొందారని పేర్కొన్నారు. పరిపాలనా రంగంలో ఆయన అందించిన సేవలు, సామాజిక అంశాలపై వ్యక్తం చేస్తున్న అభిప్రా-యాలు యువతకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయని తెలిపారు.

రాజకీయ, సామాజిక మార్పు లక్ష్యంగా నిర్వహిస్తున్న 'రాజ్యాధికార సమరభేరి' సభను విజయవంతం చేయడానికి అన్ని వర్గాల ప్రజలు భారీ సంఖ్యలో హాజరుకావాలని పార్టీ నాయకులు పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో ప్రముఖ జర్నలిస్ట్ సుదర్శన్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి కొమ్ముల ప్రవీణ్ రాజ్, రాష్ట్ర నాయకులు గిరగాని భిక్షపతి గౌడ్, అర్కటి శ్రీనిధి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## బీఎల్ఏల శిక్షణ సదస్సు

- పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్
- బూత్ స్థాయి ఏజెంట్ల పాత్ర కీలకమని వ్యాఖ్య
- నకిలీ ఓటర్ల తొలగింపులో చురుకుగా పనిచేయాలని పిలుపు



ఆదాబ్ సైబరాబాద్, కుత్బుల్లాపూర్ : టీపీసీసీ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని కొంపల్లిలోని ఎస్ఎన్ఆర్ గార్డెన్స్లో నిర్వహించిన బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్ఏ) అవగాహన, శిక్షణ సదస్సులో మాజీ శాసనసభ్యుడు కూన శ్రీశైలం గౌడ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ ఇన్చార్జ్ ఎం.ఏ. ఫహీమ్తో కలిసి ఆయన కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.
ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ పార్టీ బలోపేతం, ఎన్నికల ప్రక్రియ సమర్థ నిర్వహణలో బూత్ స్థాయి ఏజెంట్ల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.
ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో ప్రతి బీఎల్ఏ తప్పనిసరిగా పాల్గొనాలని, నకిలీ ఓటర్లను గుర్తించి తొలగించే ప్రక్రియలో అధికారులతో సమన్వయం చేసుకుంటూ బూత్ లెవల్ అధికారులతో కలిసి క్షేత్ర-స్థాయిలో పనిచేయాలని పిలుపునిచ్చారు.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి కొలన్ హనుమంత్ రెడ్డి, కోఆర్డినేటర్ మిథున్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు భూపతి రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కిషోర్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, అనుబంధ సంఘాల నాయకులు, డివిజన్ స్థాయి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అమ్జదుల్లా ఖాన్ కు 'రాజ్యాధికార సమరభేరి' ఆహ్వానం

- జూలై 5న భువనగిరిలో భారీ బహిరంగ సభ
- సామాజిక న్యాయం కోసం అన్ని వర్గాలు ఐక్యంగా రావాలని పిలుపు




ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్ : తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) ఆధ్వర్యంలో జూలై 5న భువనగిరిలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభ 'రాజ్యాధికార సమ-రభేరి'కి ఎంబీటీ పార్టీ అధికార ప్రతినిధి అమ్జదుల్లా ఖాన్ను పార్టీ నాయకులు ఆహ్వానించారు. సభకు సంబంధించిన ఆహ్వాన పత్రికను ఆయనకు అందజేశారు.

ఈ సందర్భంగా టీఆర్పీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పటేల్ వనజక్క, రాష్ట్ర మైనారిటీ విభాగం అధ్యక్షుడు సల్మాన్లు అమ్జదుల్లా ఖాన్ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సభలో పాల్గొనాల్సిందిగా కోరారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మైనారిటీల హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం అమ్జదుల్లా ఖాన్ చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. అణగారిన వర్గాలకు రాజకీయ ప్రాధాన్యత, సమాన అవకాశాలు కల్పించే దిశగా అన్ని సామాజిక వర్గాలు ఐక్యంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని తెలిపారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు రాజకీయ అధికారం దక్కాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న 'రాజ్యాధికార సమరభేరి' సభను విజయవంతం చేయడానికి అన్ని వర్గాల ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో ప్రముఖ జర్నలిస్ట్ సుదర్శన్ గౌడ్, రాష్ట్ర నాయకులు గిరగాని భిక్షపతి గౌడ్, కదారి శ్రీనివాస్, అర్కటి శ్రీనిధి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలకు అప్రమత్తమైన హైడ్రా

- రాత్రికిరాత్రే 26 చెట్లు తొలగింపు
- వాటర్ లాగింగ్ పాయింట్లను క్లియర్ చేసిన డీఆర్ఎఫ్ బృందాలు
- కీలక ప్రాంతాల్లో వరద ముప్పు నివారణకు ప్రత్యేక చర్యలు




ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్ : శుక్రవారం రాత్రి నగరంలో కురిసిన భారీ వర్షాలకు హైడ్రా డీఆర్ఎఫ్ బృందాలు అప్రమత్తంగా స్పందించాయి. ఈదురు గాలులతో పలుచోట్ల చెట్లు నేలకూలగా, నీరు నిలిచిన ప్రాంతాల్లో వెంటనే సహాయక చర్యలు చేపట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చాయి. రాత్రి 11.30 గంటల వరకు నగర వ్యాప్తంగా 26 చెట్లు నేలకూలినట్లు ఫిర్యాదులు అందగా, వాటిలో 21 చెట్లను అర్ధరాత్రిలోపే తొలగించినట్లు అధికారులు తెలిపారు. మెహిదీపట్నం, అత్తాపూర్ ప్రాంతాల్లో నీరు నిలిచిన ప్రాంతాలను డీఆర్ఎఫ్ బృందాలు వెంటనే క్లియర్ చేశాయి. బంజారాహిల్స్ రోడ్ నంబర్-1లోని జలగం వెంగళరావు పార్కు సమీపంలో పడిపోయిన చెట్లను తొలగించి, నిమ్స్ ఆసుపత్రికి విద్యుత్ సరఫరా అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు.

### వరద ముప్పు ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి

ఇటీవల భారీ వర్షాలతో నీట మునిగిన ప్రాంతాలపై హైడ్రా ప్రత్యేక దృష్టి సారించింది. కొండాపూర్, మియాపూర్, రాయదుర్గం మెట్రో స్టేషన్, గచ్చిబౌలి బయోడైవర్సిటీ జంక్షన్ పరిసరాల్లో వరదలకు కారణమైన పూడికను పూర్తిస్థాయిలో తొలగించింది. దీంతో శుక్రవారం భారీ వర్షం కురిసినా ఆయా ప్రాంతాల్లో నీరు నిలవకుండా సాఫీగా పారిపోయింది. నార్సింగి మెయిన్ రోడ్డులో నేలకూలిన చెట్టును కూడా డీఆర్ఎఫ్ సిబ్బంది తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. ఇందిరా పార్క్ స్టీల్ బ్రిడ్జిపై ఉన్న డ్రైనేజీ రంధ్రాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించడంతో అక్కడ నీరు నిలవకుండా చూసారు.

### క్షేత్రస్థాయిలోనే సహాయక చర్యలు

వర్షం కొనసాగుతున్న సమయంలో కూడా హైడ్రా సిబ్బంది క్షేత్రస్థాయిలోనే ఉండి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించారు. బంజారాహిల్స్లో పడిపోయిన చెట్లను ఆర్ఎఫ్వో జయప్రకాశ్, ఎస్ఎఫ్వో చంద్రశేఖర్ నేతృత్వంలోని బృందాలు వేగంగా తొలగించాయి.
మంగళవారం వర్షాలకు తీవ్రంగా ప్రభావితమైన ప్రెస్టన్ ప్రైమ్ మాల్, ఎన్నికల కమిషన్ కార్యాలయ పరిసర ప్రాంతాల్లో చేపట్టిన నివారణ చర్యలు ఫలించాయి. శుక్రవారం భారీ వర్షం కురిసినప్పటికీ అక్కడ ఎక్కడా నీరు నిలవలేదు. ఖాజాగూడ చెరువులోకి వరద నీరు సులభంగా చేరేలా మార్గాలను ఏర్పాటు చేయడంతో పరిస్థితి మెరుగుపడింది. కొండాపూర్ సంతోష్ దాబా సమీపంలోని వరద కాలువలో పూడిక తొలగించడంతో అక్కడ కూడా నీటి నిల్వ సమస్య తలెత్తలేదు.

### నగరవ్యాప్తంగా డీఆర్ఎఫ్ బృందాల సేవలు

ఉప్పల్, అత్తాపూర్, ఫిర్జాదిగూడ, ఆరాంఘర్ క్రాస్ రోడ్స్, కుత్బుల్లాపూర్ తదితర ప్రాంతాల్లో ఎస్ఎఫ్వోలు శ్రీనివాస్, చరణ్, గౌతమ్, సుభాష్, సతీష్, ఏడీఎఫ్వో మోహన్రావు నేతృత్వంలోని హైడ్రా డీఆర్ఎఫ్ బృందాలు రాత్రంతా క్షేత్రస్థాయి-ంలో పనిచేసి చెట్లు తొలగించడం, నీటి నిల్వలను నివారించడం వంటి చర్యలు చేపట్టాయి.
వర్షాకాలంలో ఎలాంటి అత్యవసర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు హైడ్రా బృందాలు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉన్నాయని అధికారులు తెలిపారు.

EDITOR PRINTER AND PUBLISHER OWNED BY BILLALPURSARA SHIVA KUMAR, PRINTING AT RIYAZ PRINTING PRESS, S NO 22-8-161, BEHIND NAYAAB HOTEL, CHATTA BAZAR, HYDERABAD, TELANGANA - 500002 AND PUBLISHED FROM H.NO: 2-1-602, TARAKARAMA NAGAR, YELLAMMABANDA, KUKATPALLY, MEDCHEL-MALKAJGIRI DIST, TELANGANA-500 072. PRGI: TGTEL/26/A4985. PHONE NO: +91 8686861338, +91 81215 50907 EMAIL : shivakumarlal@gmail.com